# సాయిమార్గాన్ని అనుసరించి సత్కీర్తిని పొందండి

క్రమము తప్పక మింట ప్రతిదినంబును భాను
దుదయాస్తమయముల నొందనేల?
గగనంబునకు కాంతికైసేయు తారలు
పగలు మాత్రము దాగు భంగియేల?
క్షణమైన విశ్రాంతిగొనక తా పవనుండు
జీవకోటుల బ్రోవ వీవనేల?
అనిశంబు కలకల ధ్వనుల నవ్వుచు నది
సలిలమై ప్రవహించు చందమేల?
ప్రకృతిలొనెందు చూచిన భ్రమయె ఏల?
భువిని ధన కుల మత జాతి భేదమేల?
ఎవరియానతి యిది ఎల్లనిట్లు జరుగు
నతడెయితడని యీతడెయతడనుచు
సర్వులకధిపతి యనుచు కాంచరయ్య!

*ప్రేమస్వరూపులారా!* ప్రాచీన కాలమునుండి భారతీయులు తమ ఆధ్యాత్మిక తత్త్వ ప్రభావముచేత అన్ని దేశములకూ శాంతిభద్రతలను చేకూర్చుతూ వస్తున్నారు. నాటిమొదలు నేటివరకు 'లోకాస్సమస్తాః సుఖినో భవంతు' అన్నదే భారతీయులయొక్క ప్రధాన ఆశయం. ఈనాటి మానవుడు లౌకికంగా, భౌతికంగా ఎంతో ప్రగతిని సాధించాడుకాని, క్షుద్ర విమర్శలను, సంకుచిత భావములను అరికట్టుకొనలేక నైతికంగా చాలా దిగజారి పోతున్నాడు. మానవునియొక్క హృదయంలో గాఢంగా నాటుకొనిపోయిన స్వార్థమే ఈ దుస్థితికి మూలకారణం. తాను ఏ వస్తువును ప్రేమించినా, ఏ వ్యక్తిని ప్రేమించినా తన స్వార్థంకోసమే ప్రేమిస్తున్నాడు; తాను ఏది తలచినా, ఏది చెప్పినా, ఏది చేసినా అంతా తన స్వార్థంకోసమే! ఇలాంటి సంకుచితమైన భావములను దూరం గావించుకొని ఏనాడు హృదయాన్ని పరిశుద్ధం గావించుకొనునో ఆనాడే తాను నిజంగా ఉగాదియొక్క ఫలితమును అనుభవించినవాడౌతాడు, ఉత్తమునిగా రూపొందుతాడు.

ఈ ఉగాది రోజున జనులు తెల్లవారుఝామున లేచి అభ్యంగన స్నానమాచరించి, నూతన వస్త్రములను ధరిస్తున్నారు; తీపిపదార్థాలను భుజిస్తున్నారు. కాని, అంతర్భావమునందున్న మాలిన్యమును వీడకుండా బాహ్యంగా నూతన వస్త్రములను ధరిస్తే ప్రయోజన మేమిటి? ముఖ్యంగా అంతర్భావమును పరిశుద్ధం గావించుకోవాలి. "జంతూనాం నరజన్మ దుర్లభం," అన్నారు. ఇలాంటి దుర్లభమైన మానవజన్మ తనకు ప్రాప్తించినప్పటికీ మానవుడు మానవునిగా జీవించడానికి కృషి చేయడం లేదు. కాలు మొదలు తలవరకు

కోరికలను నింపుకొని, కోరికలు తీరినప్పుడే తనకు ఆనందము లభిస్తుందని భావిస్తున్నాడు. ఇది చాలా పొరపాటు. కోరికలు తీరినప్పుడు కాదు, కోరికలు ఆరినప్పుడే తనకు ఆనందము లభిస్తుందనే సత్యాన్ని గుర్తించాలి.

### ఏకత్వాన్ని గుర్తించి వర్తించే గుణవంతులు కావాలి

ప్రేమస్వరూపులారా! యుగములు గడిచిపోయినప్పటికీ, జగములు కదలిపోయినప్పటికీ మానవుని హృదయం మారడం లేదు. ఆధునిక విద్య ప్రపంచాన్ని అల్లకల్లోలం గావిస్తున్నది. విద్యవలన మానవుని హృదయం మారుతుందని భావిస్తున్నారు. నిజమే, మారుతున్నది. కాని, ఏవిధంగా? అతివిచిత్రంగా మారిపోతున్నది. మానవుడు నేర్చుకోవలసిన విషయాలను నేర్చుకోవడంలేదు; పశుభావాలను పెంచుకుంటూ, రాక్షసకృత్యాలకు పాల్పడుతూ మానవత్వాన్ని వ్యర్థం గావించుకుంటున్నాడు. అనేకత్వములోని ఏకత్వాన్ని గుర్తించి మానవత్వాన్ని సార్థకము చేసుకొమ్మని భారతీయ సంస్కృతి బోధిస్తున్నది. ఈనాడు ఏకత్వాన్ని అనేకత్వంగా విభజించే మేధావులు, విద్యావంతులు పెరిగిపోతున్నారుగాని, అనేకత్వంలోని ఏకత్వాన్ని గుర్తించి వర్తించే గుణవంతులు కనిపించడం లేదు. భారతీయ సంస్కృతి ఎంత పవిత్రమైనదో భారతీయులే గుర్తించుకోలేక పోతున్నారు. భారతీయ సంస్కృతియొక్క విలువను ఇంతవరకు ఎవ్వరూ పరిపూర్ణంగా అర్థం చేసుకోలేదు. భారతీయుల శక్తి సామర్థ్యములు అపరిమితమైనవి. సమష్టి సంక్షేమాన్ని అభివృద్ధి పరచుకొని ఆనందించడం భారతీయుల లక్షణం. కాని, అలాంటి విశాలమైన భావము ఈనాడు ఎక్కడా కనిపించడం లేదు.

### "కలసి మెలసి పెరుగుదాం..."

కాలము చాలా పవిత్రమైనది. దీనిని ఏరీతిగా ఉపయోగ పెడుతున్నారో ఎవరికి వారు యోచించుకోవాలి. గడచిన కాలము తిరిగి రాదు. వచ్చే కాలము మీదికాదు. కనుక, వర్తమానమును సద్వినియోగపరచుకోవడమే మీ ప్రధాన కర్తవ్యం. భగవంతుడు కాలస్వరూపుడు. కనుకనే, "కాలాయ నమః కాలకాలాయ నమః కాలదర్పదమనాయ నమః కాలాతీతాయ నమఃకాలనియమితాయ నమః కాలస్వరూపాయనమః..." అని భగవంతుణ్ణి వర్ణిస్తున్నారు. ఇంతియేకాదు. "సహస్రశీర్షా పురుషః సహస్రాక్షః సహస్ర పాత్..." అన్ని శిరస్సులూ, అన్ని నేత్రములూ, అన్ని పాదములూ భగవంతునివే అని బోధించింది వేదము. ఇట్టి వేదసంస్కృతిని విశ్వసించి మన ప్రాచీన ఋషులు దివ్యమైన భావములతో, భవ్యమైన ప్రవర్తనతో కాలమును సార్థకం గావించుకున్నారు. ప్రజలంతా ఐకమత్యంగా, అన్యోన్యంగా జీవించాలని వారు బోధిస్తూవచ్చారు.

*"కలసిమెలసి పెరుగుదాం కలసిమెలసి తిరుగుదాం*
*కలసిమెలసి తెలుసుకొన్న తెలివిని పోషించుదాం*
*కలసిమెలసి కలత లేక చెలిమితో జీవించుదాం"*

కాని, ఈనాడు అలాంటి ఐకమత్యము ఎక్కడా కనిపించడం లేదు. ఒక ఇంట్లో నలుగురుంటే, ఆ నలుగురూ నాలుగు మార్గాల ననుసరిస్తున్నారు.

### ఆనందమునకు విశ్వాసమే తొలిమెట్టు

ఈనాడు ప్రతి మానవుడు ఆనందం కావాలని ఆశిస్తున్నాడు. ఆనందంకోసం అనేక గ్రంథములను పఠిస్తున్నాడు; తీర్థయాత్రలు సల్పుతున్నాడు; ఎందరో పెద్దలను దర్శించి వారి బోధనలను ఆలకిస్తున్నాడు; ఎన్ని పూజలో చేస్తున్నాడు; ఎన్ని జపములో ఆచరిస్తున్నాడు; ఎన్ని తపములో ఒనర్చుతున్నాడు. కాని, వీటిలో ఆనందము ఏమాత్రం లేదు. మానవునిలో అన్నమయ, ప్రాణమయ, మనోమయ, విజ్ఞానమయ,

ఆనందమయకోశములనే పంచకోశము లున్నవి. ఆనందమయకోశము తనయందే ఉన్నప్పటికీ మానవునిలో ఆనందము శూన్యమైపోతున్నది. ఆస్తిపాస్తులు, భౌతికమైన సుఖములు తనకు ఆనందమునందిస్తాయని భావిస్తున్నాడు మానవుడు. ఇది మూర్ఖత్వం. భౌతిక సుఖములు కేవలం పరిమితమైన ఆనందాన్ని అందిస్తాయి. నిజమైన ఆనందము అపరిమితమైనది. అది బయటి నుండి లభించదు; హృదయమునుండియే ఆవిర్భవిస్తుంది. హృదయం దైవస్థానము. దానినుండి లభించేదే నిజమైన ఆనందము. అట్టి ఆనందము ననుభవించాలంటే మొట్టమొదట ప్రగాఢమైన విశ్వాసాన్ని పెంచుకోవాలి. విశ్వాసమువలన ప్రేమ, ప్రేమవలన ధర్మము, ధర్మమువలన సత్యము ఆవిర్భవిస్తాయి. సత్యముద్వారానే దైవము సాక్షాత్కరిస్తాడు. దైవముద్వారానే ఆనందము లభ్యమౌతుంది. కనుక, ఆనందమునకు మూలాధారము దైవమే. దైవమునకు మూలాధారము సత్యమే. సత్యమునకు మూలాధారము ధర్మమే. ధర్మమునకు మూలాధారము ప్రేమనే. ప్రేమకు మూలాధారము విశ్వాసమే. కాని, ఈనాటి మానవునికి తనపైనే తనకు విశ్వాసము లేదు. విశ్వాసము లేకపోతే శ్వాస లేనట్లే! ప్రాచీన ఋషులు మానవునికి నమ్మకము ప్రధానమైనదని బోధించారు. శాస్త్రము, ధర్మము – ఈ రెండింటినీ మన రెండు నేత్రాలుగా భావించాలి. కాని, ఈనాడు బ్రాహ్మణులుకూడా వీటిని విస్మరిస్తున్నారు.

*శాస్త్రంబునెప్పుడు సత్యంబుగా నమ్ము*
*వేదసమ్మతులైన విప్రులార!*
*దేశంబు కొరకునై దేహమర్పణ చేసి*
*రహిమించు రాజాధిరాజులార!*
*ధనధాన్యములు గల్గి ధర్మగుణంబుతో*
*వరలుచుండెడి ఆర్యవైశ్యులార!*
*వ్యవసాయవృత్తిచే నాహారమందించి*
*సుఖజీవనము చేయు శూద్రులార!*
*కాలమంతయు నూరక గడుపనేల?*
*సర్వజన సమ్మతమ్మగు సత్యమైన*
*భక్తిమార్గము గొను డిహపరములిచ్చి*
*సత్యముగ మిమ్ము సాకును సాయిబాబ.*

లౌకికమైన విషయవాంఛలలో మునిగి కాలమును వ్యర్థం చేయకండి. వీటివల్ల మీకు అణుమాత్రమైనా ఆనందం లభ్యం కాదు.

**“కృతఘ్నుఘ్నాయనమః”**

మానవునికి ప్రధానంగా ఉండవలసినది కృతజ్ఞత. భారతీయులు సూర్యనమస్కారములను ఆచరించేటప్పుడు ‘కృతఘ్నుఘ్నాయనమః’ అంటారు. దీని అర్థమేమిటి? మానవుని నేత్రములలో సూర్యుని తేజస్సు సూక్ష్మరూపములో చేరియున్నది. ఏ మానవుడైతే ఇతరులు తనకు చేసిన మేలును మరచిపోయి కృతఘ్నునిగా రూపొందుతాడో అట్టివాని నేత్రాలనుండి సూర్యుడు తన తేజస్సును ఉపసంహరించు కుంటాడు. అనగా, కృతజ్ఞత లేనివాడు అంధుడనే చెప్పవచ్చును. కనుక, ఎవరైనా సరే, ఇతరులు చేసిన మేలును మరువకూడదు; ప్రాణాలకైనా తెగించి కృతజ్ఞత చూపాలి. భగవంతునినుండి తానెన్నో ఉపకారములను పొందుతున్నప్పటికీ భగవంతునికి కించిత్తైనా కృతజ్ఞత చూపకుండా మానవుడు స్వార్థ పూరితమైన లౌకికజీవితాన్ని గడుపుతున్నాడు. ఇలాంటి మూర్ఖులు మానవులెట్లు కాగలరు? అసలు ఆధ్యాత్మికమనగా అర్థమేమిటి? ఆత్మను స్మరించడమే ఆధ్యాత్మికమని

మీరు భావిస్తున్నారు. కాదు, కాదు. మానవుడు తనయందున్న పశుత్వాన్ని నిర్మూలించుకొని తన మానవత్వాన్ని దైవత్వముగా మార్చుకోవడమే ఆధ్యాత్మికము. కాని, తన మానవత్వాన్ని దైవత్వంగా మార్చుకోవడానికి కృషిచేయక పశుత్వానికి దిగజారి పోతున్నాడు; పవిత్రమైన ఆధ్యాత్మికతత్త్వాన్ని విస్మరిస్తున్నాడు; పండుగలను జరుపుకోవడమంటే పాయసాన్ని వండుకొని భుజించడమేనని భావించి కాలాన్ని వ్యర్థం గావిస్తున్నాడు. ఇది కాదు ఆధ్యాత్మికము. పర్వదినముల యొక్క అంతరార్థాన్ని, వాటి లక్ష్యాన్ని గుర్తించి వర్తించాలి. "నేను మానవుడను కాను, మానవాకారము ధరించిన దైవాన్ని" అని దృఢంగా విశ్వసించాలి. అప్పుడే తనయందున్న పశుత్వము దూరమౌతుంది. కాని, ఈనాటి మానవుడు మానవత్వాన్నే మరచిపోవడంచేత పశుత్వము విజృంభిస్తున్నది. ప్రేమస్వరూపులారా! ఎలాంటి పరిస్థితియందైనా మీ మానవత్వాన్ని మీరు కాపాడుకోవాలి. కేవలం స్వార్థమును లక్ష్యమునందుంచుకొని మీరు కాలమును వ్యర్థం చేయకూడదు.

**ఎవరు నిజమైన భక్తుడు?**

ఒక పర్యాయం శ్రీమన్నారాయణుడు నారదుణ్ణి లోకములో అందరికంటే గొప్ప భక్తుడెవరో తెలుసుకొని రమ్మని పంపించాడు. నారదుడు బయలుదేరే ముందు "స్వామీ! ఎలాంటివానిని నేను ఎన్ను కోవాలి?" అని అడిగాడు. శ్రీమన్నారాయణుడు చెప్పాడు – "ఎవరైతే పరిశుద్ధమైన హృదయంతో దైవనామాన్ని స్మరిస్తూంటాడో అతనే నిజమైన భక్తుడు. లోకసంబంధమైన వ్యవహారాలు ఎన్ని ఉన్నప్పటికీ లక్ష్యమును దైవంపై నిల్పుకోవాలి. భగవన్నామాన్ని విస్మరించినవాడు మూర్ఖుడనే చెప్పవచ్చును." అప్పుడు నారదుడు "స్వామీ! నేను నిరంతరం భగవన్నామాన్ని స్మరిస్తూనే ఉన్నాను కదా! నాకంటే గొప్ప భక్తుడున్నాడా?" అని అడిగాడు. అతనిలో అహంకారం ప్రారంభమైంది. "నేనే అందరికంటే గొప్ప భక్తుడను," అని అనుకోవడమే పెద్ద అహంకారం. "నాయనా! ఇలాంటి భక్తులు లోకంలో ఇంటింటిలో ఉన్నారు, ఇంచ్ఇంచ్‌కీ కనిపిస్తున్నారు. ఇది కాదు నిజమైన భక్తి. హృదయంలో ఆవిర్భవించిన ప్రేమను సర్వత్రా ప్రసరింపజేయాలి. మానవుడు భుజించిన ఆహారము ఉదరములో జీర్ణమై దాని సారము సర్వాంగములకు సరఫరా అయినట్లుగా, తాను హృదయములో స్మరించిన భగవన్నామముయొక్క దివ్యప్రభావము కన్నులలో చేరాలి, చెవులలో చేరాలి, నాలుకపై చేరాలి, చేతులలో చేరాలి, పాదములలో చేరాలి. అప్పుడే మానవుడు నిజంగా భగవన్నామమును స్మరించినవాడౌతాడు. జీర్ణమైన ఆహారముయొక్క సారము కన్నులలో చేరినప్పుడు ఏమౌతుంది? ఎలాంటి ఆహారమో అలాంటి దృష్టి కల్గుతుంది. అదేరీతిగా, హృదయంలో స్మరించిన భగవన్నామంయొక్క ప్రభావము కన్నులలో చేరినప్పుడు దృష్టి పవిత్రమైనదిగా రూపొందుతుంది; నాలుకపై చేరినప్పుడు పవిత్రమైన పలుకులనే పలుకుతాము; చెవులలో చేరినప్పుడు పవిత్రమైన విషయాలనే వింటాము; పాదములలో చేరినప్పుడు పవిత్రమైన ప్రదేశాలకే నడుస్తాము; చేతులలో చేరినప్పుడు సార్థకమైన పనులనే ఆచరిస్తాము. ఈరీతిగా, తన సర్వాంగములతోను సార్థకమైన కర్మల నాచరించేవాడే నిజమైన మానవుడు. అలాంటి పరమభక్తుడు ఎక్కడున్నాడో చూసి రమ్మ"ని చెప్పాడు.

నారదుడు లోకమంతా సంచారం చేశాడు. కాని, అతనికి తనను మించిన భక్తుడు లేడనే అహంకారం పోలేదు. ఇంక, వైకుంఠానికి తిరిగి వెళదామని అనుకుంటూండగా ఒక అరణ్యంలో ఒక చెట్టు క్రింద ఒక వ్యక్తి కన్నులు మూసుకొని నామస్మరణ చేస్తూ కనిపించాడు. అతని చేతిలో ఒక పదునైన కత్తి కనిపించింది. నారదుడు అతని దగ్గరకు వెళ్ళి, "నాయనా! నీవెవరు?" అని అడుగగా, "స్వామీ! పరమాత్ముని భక్తుడను," అన్నాడు. నారదునికి ఆశ్చర్యం కల్గింది. "నీవు భక్తుడివైతే నీ చేతిలో కత్తి ఎందుకు? ఎవరిని చంపడంకోసం పెట్టుకున్నావు?" అని అడిగాడు. "స్వామీ! ఈ కత్తితో నల్గురిని చంపాలి," అన్నాడతను. ఎవరా నల్గురు? "మొట్టమొదట ఆ ద్రౌపదిని చంపాలి," అన్నాడు. నారదుడు, "అదేమిటి, ద్రౌపది నిరంతరం కృష్ణనామాన్నే

స్మరిస్తుంది కదా! ఆమె భక్తికి మెచ్చి కృష్ణుడు ఆమెకు అక్షయ వలువలిచ్చి కౌరవ సభలో ఆమె మానం కాపాడాడు కదా! అలాంటి మహాభక్తురాలిని ఎందుకు చంపాలనుకుంటున్నావు?" అనిఅడిగాడు. "ఆమె భక్తురాలే కావచ్చు. కాని, నా కృష్ణుడు భోజనం చేస్తున్న సమయంలో "కృష్ణా!" అని పిలిచింది. తక్షణమే నా స్వామి తన ఆహారాన్ని వదలిపెట్టి ఆమెను రక్షించడానికి వెళ్ళాడు. ఆ రోజున నా కృష్ణునికి భోజనం లేకుండా చేసింది కాబట్టి, ఆమెను చంపాలి," అన్నాడు. "రెండవ వ్యక్తి ఎవరు?" "ఆ ప్రహ్లాదుడు పదేపదే నా స్వామిని పిలిచి చాలా ఇబ్బంది పెట్టాడు. తన తండ్రి తనను ఏనుగులచేత త్రొక్కించేటప్పుడు "నారాయణా!" అని పిలిచాడు. అతనిని రక్షించ డానికి నారాయణుడే ఏనుగులచేత త్రొక్కించుకున్నాడు. ఈరీతిగా నా స్వామిని కష్టపెట్టినందుకు ప్రహ్లాదుణ్ణి చంపాలి," అన్నాడు. "మరి మూడవ వ్యక్తి ఎవరు?" "మీరా నిరంతరం "గిరిధారీ! గిరిధారీ!" అని స్మరించి నా స్వామిని చాలా బాధపెట్టింది. ఆమెకు తగల వలసిన దెబ్బలన్నీ నా కృష్ణునికే తగిలాయి. కనుక, ఆమెను కూడా చంపాలి," అన్నాడు. "సరే, ఇంక నాల్గవ వ్యక్తి ఎవరు?" అని అడుగగా, "నారదుడనేవాడు ఒకడున్నాడు; చేతిలో తంబుర పట్టుకొని నిరంతరం "నారాయణ! నారాయణ!" అని అంటూంటాడు. అతనిది స్వార్థభక్తియేగాని, ప్రేమతోకూడిన పరార్థభక్తి కాదు. కాబట్టి, అతనిని కూడా చంపాలి," అన్నాడు.

అతని మాటలు విని నారదుడు భయపడ్డాడు. తన అహంకారమే దీనికి కారణమని గుర్తించాడు. వెంటనే శ్రీమన్నారాయణునివద్దకు వెళ్ళి ఈవిషయాన్ని విన్నవించి "స్వామీ! నిరంతరం భగవన్నామ స్మరణ చేయడం కూడా భగవంతుణ్ణి కష్టపెట్టినట్లేనా?" అని అడిగాడు. నారాయణుడు "నీవు చాలా పొరబడుతున్నావు నారదా! భగవంతునిపట్ల గల అనన్యప్రేమచేత అతడు ఈవిధంగా భావిస్తున్నాడు. భక్తులు భగవంతునికి నిద్రాహారాలు లేకుండా చేస్తున్నారని, ఇబ్బంది కల్గిస్తున్నారని అతను బాధపడుతున్నాడు. భగవంతుని సుఖమే తన సుఖమని భావించి, సర్వకాల సర్వావస్థలయందు భగవంతునికి ఆనందము కల్గించాలి. దేహానికిగాని, మనస్సుకుగాని ఏ కించిత్ బాధకూడా కల్గించకూడదు. అలాంటివాడే నిజమైన భక్తుడు", అన్నాడు. నారదుడు సత్యాన్ని గుర్తించి "స్వామీ! నా అహంకారాన్ని అణగద్రొక్కడానికే నీవు నాకీ పని పెట్టావు", అన్నాడు.

మీలో ఎంతటి భక్తి ఉన్నప్పటికీ, భగవంతుని మనస్సుకు కించిత్తైనా కష్టం కలుగకుండా చూసుకోవాలి. భగవంతుడు తనలో ఏమాత్రం బాధపడినా అది మీకు బాధనే కలిగిస్తుంది. భగవంతుని సుఖమే మీ సుఖము. మీ సుఖమే భగవంతుని సుఖము. ఈ రెండింటి ఏకత్వాన్ని అనుభవించాలి. "నేను, భగవంతుడు ఒక్కటే," అనే సత్యాన్ని గుర్తించాలి, అనుభవించాలి. ఈనాటి భక్తులు చాలామంది కేవలం స్వార్థభక్తినే అనుసరిస్తున్నారు. వారి సుఖమే వారికి కావాలి. దైవముసంగతి వారి కక్కర్లేదు. దైవము ప్రేమ స్వరూపుడు. ఆ ప్రేమ అందరియందు ఉన్నది. ఆ ప్రేమను మనం ఇతరులతో పంచుకోవాలి. ఇదియే భగవంతుడు కోరేది.

**ప్రతి మనిషిలో దేవుడున్నాడు**

ప్రాచీనఋషులు భగవంతుడెక్కడో ప్రత్యేకంగా ఉన్నాడని భావించలేదు. వేదము "సహస్ర శీర్షా పురుషః సహస్రాక్షః సహస్ర పాత్" అన్నది. అనగా, భగవంతునికి అనేక వేల శిరస్సులున్నాయని చెప్పింది. దీని అంతరార్థ మేమిటి? మనకు కనిపించే శిరస్సులన్నీ భగవంతుని శిరస్సులే. భగవంతుడు ప్రతి మనిషిలో ఉన్నాడు, ప్రతి హృదయంలో ఉన్నాడు. కనుక, భగవంతుడు ఎక్కడో ఒక మందిరంలోనో, ఒక మసీదులోనో, ఒక చర్చిలోనో ప్రత్యేకంగా ఉన్నాడని భావించకూడదు. ఎక్కడ మానవుడున్నాడో అక్కడ భగవంతుడున్నాడు. "దైవం మానుష రూపేణ." కాని, ఈ సత్యాన్ని గుర్తించుకోలేక మీరు ఇతరులను విమర్శిస్తుంటారు. ఎవరిని మీరు దూషిస్తున్నారు? ఎవరిని పూజిస్తున్నారు? ముందు విచారణ చేసుకోండి. ఎవరిని దూషించినప్పటికీ మిమ్మల్ని మీరు దూషించుకున్నట్లే; ఎవరిని పూజించినప్పటికీ మిమ్మల్ని మీరు పూజించుకున్నట్లే. ఎందుకంటే, ఆ పూజింపబడే

దేవుడు మీయందే ఉన్నాడు. "సర్వజీవ నమస్కారం కేశవం ప్రతిగచ్ఛతి" ఎవరికి నమస్కరించినప్పటికీ దైవానికి నమస్కరించినట్లే.

**మరో జన్మ వద్దు, ఈ జన్మ చాలు**

ప్రేమస్వరూపులారా! ఎన్ని ఉగాదులో గడచిపోయినాయి. కాని, మానవుని హృదయమునుండి దుర్భావాలు మాత్రం తొలగిపోవడం లేదు. ఏనాడు మానవుడు తన హృదయాన్ని ప్రేమతో నింపుకొని త్యాగమార్గాన్ని అవలంబిస్తాడో ఆనాడే నిజంగా ఉగాదిని జరుపుకున్న వాడౌతాడు. నూతన వస్త్రాలను ధరించినంతమాత్రాన ఉగాదిని జరుపుకున్నట్లు కాదు. ఈనాడు మీరు క్రొత్త షర్టును ధరించవచ్చు. కాని, అది ఎంతకాలం క్రొత్తగా ఉంటుంది? రేపటికి అది పాతదే. ఈనాటి "న్యూస్ పేపర్"ను కొని చదివాము. చదివిన పేపర్‌ని మళ్ళీ చదవము కదా! ఈనాటి "న్యూస్ పేపర్" రేపటికి "వేస్ట్ పేపర్" అవుతుంది. మన జీవితముకూడా ఒక "న్యూస్ పేపర్" వంటిది. ఒకతూరి మనకీ జన్మ లభించింది, ఎన్నో అనుభవించాము. చాలింక. మరో జన్మ మనకు అక్కర్లేదు; ఇంకో "న్యూస్ పేపర్"ను మనం తీసుకోనక్కర్లేదు. మనకు లభించిన ఈ "న్యూస్ పేపర్" (ప్రస్తుత జన్మ)ను మనం చదివాము, ఆనందించాము, దుఃఖించాము, విచారించాము, ఇంకా ఎన్నో విషయాలను అనుభవించాము. "ఓ భగవంతుడా! ఈ 'న్యూస్ పేపర్'ను నాకీనాడు ఇచ్చావు, అనుభవించవలసినవన్నీ అనుభవించాను. ఇంక, మరో 'న్యూస్ పేపర్' (మరో జన్మ) నాకు అక్కర్లేదు" అని ప్రార్థించాలి. పునర్జన్మ లేకుండా చేసుకోవాలి. శంకరులవారు చెప్పారు –

*"పునరపి జననం పునరపి మరణం*
*పునరపి జననీ జఠరే శయనం*
*ఇహ సంసారే బహు దుస్తారే*
*కృపయా పారే పాహి మురారే."*

శంకరులవారు తన శిష్యులను వెంటపెట్టుకొని గంగానదిలో స్నానం చేయడానికి వెళుతూ మార్గమధ్యంలో ఒక చెట్టు క్రింద ఒక వ్యక్తి కూర్చుని "డుకృఙ్ కరణే, డుకృఙ్ కరణే..." అంటూ పాణినీ వ్యాకరణ సూత్రాలను వల్లెవేయడం చూశారు. అతనివద్దకు వెళ్ళి,

*"భజ గోవిందం భజ గోవిందం*
*గోవిందం భజ మూఢమతే*
*సంప్రాప్తే సన్నిహితే కాలే*
*నహి నహి రక్షతి డుకృఙ్ కరణే"*

"నాయనా! నీవు వల్లె వేసే వ్యాకరణ సూత్రాలు అంత్యకాలంలో నిన్ను ఆదుకోవు. కాబట్టి, గోవిందుణ్ణి భజించు," అని బోధించారు. ఆయన అనేక వేదాంతగ్రంథాలను రచించారు. కాని, చివరికి తాను కూడా భక్తిమార్గంలో ప్రవేశించారు; నామస్మరణ చేయవలసిందిగా బోధిస్తూవచ్చారు. ఈనాడు అనేకమంది నామస్మరణ చేస్తున్నారు. కాని, ఆ నామముయొక్క సారాన్ని గ్రోలడం లేదు. జగత్తులో ఎన్నో చేస్తున్నారు, ఎన్నో అనుభవిస్తున్నారు. కాని, ఆనందానికి నోచుకోవడం లేదు. ఈ ప్రకృతిలోని వస్తువాహనాదుల వలనగాని, కర్మాచరణవలనగాని, గ్రంథపఠనంవలనగాని ఆనందము లభ్యం కాదు. హృదయాన్ని పవిత్రము గావించుకున్నప్పుడే మీకు భగవంతుడు సాక్షాత్కరిస్తాడు. అందరినీ ప్రేమించండి, అందరిలో భగవంతు డున్నాడని విశ్వసించండి, అందరినీ ఆనందపరచండి. అప్పుడే మీకు ఆనందం లభ్యమౌతుంది. ఇతరులను ఆనందింపజేయకుండా మీకు మాత్రం

ఆనందం కావాలంటే లభ్యమౌతుందా? కాదు, కాదు, కాదు.

ప్రేమస్వరూపులారా! ఈనాటినుండైనా మీ హృదయాన్ని పవిత్రం గావించుకోవడానికి తగిన ప్రయత్నం చేయండి. జరిగిందేదో జరిగి పోయింది. ఎంత ప్రయత్నించినా అది తిరిగి రాదు. నడుచుకుంటూ వచ్చే సమయంలో రోడ్డును చూసుకుంటూనే వచ్చారు. ఇక మీ ముందున్న రోడ్డును చూడాలిగాని, వెనుకకు తిరిగి చూసిన రోడ్డునే చూడటమెందుకు? కాబట్టి, గతాన్ని గూర్చి చింతించవద్దు. భవిష్యత్తు మీ చేతిలో లేదు. రేపటివరకు మీరు బ్రతికి ఉంటారనే నమ్మకమేమిటి? కనుక, భవిష్యత్తును గూర్చి విచారించవద్దు. వర్తమానము (Present)ను సద్వినియోగ పరచుకోండి. ఇది Ordinary present కాదు, Omnipresent. ఎందుకంటే, భూతభవిష్యత్కాలముల ఫలితాలు వర్తమానములోనే ఇమిడియున్నాయి. వర్తమానములో పవిత్రమైన కర్మల నాచరించినప్పుడు భవిష్యత్తులో లభించే ఫలితాలుకూడా పవిత్రంగానే ఉంటాయి.

ఈనాడు ఆంధ్రులు ఉగాది జరుపుకుంటున్నారు. రేపటిదినం తమిళుల నూతన సంవత్సరాది. కేరళీయుల పండుగ 'విషు'కూడా రేపే వస్తోంది. ఈరీతిగా, ప్రతి సంవత్సరం ఎన్నో పండుగలు వస్తున్నాయి. పండుగలకేమీ తక్కువ లేదు. కావలసినన్ని పండుగ లున్నాయి. అయితే, పండుగల అంతరార్థాన్ని గుర్తించి, వాటిని సరియైనరీతిలో అనుభవించే బుద్ధిని అభివృద్ధిపరచుకోవాలి. ఈ క్షణంనుండి మీలోని దుర్గుణాలను, దురభ్యాసాలను దూరం చేసుకొని మీ హృదయాన్ని పవిత్రం గావించుకోండి. పవిత్రమైన పనులు చేయండి. అప్పుడే మీ జీవితం సార్థకమౌతుంది. ఇదియే ఉగాది అందించే సందేశం.

రేపటిదినం తమిళుల సంవత్సరాదిని పురస్కరించుకొని మద్రాసు నుండి అనేకమంది వచ్చారు. మద్రాసు ఈనాటిది కాదు. ప్రాచీన కాలమునుండి భారతీయులు మద్రాసును ఒక ముఖ్యపట్టణంగా పెట్టుకున్నారు. కాని, తరువాత రాజకీయ తంత్రములవల్ల వేరువేరు రాష్ట్రములు ఏర్పడ్డాయి. కాని, నాకలాంటి భేదములు లేవు. అందరూ నావారే. అందరూ ఒక్కటే. అందరిపట్ల సమరసభావంతో వర్తించాలి. అనేక సంవత్సరాలుగా మద్రాసు ప్రజలు త్రాగునీటి సమస్యతో సతమతమౌతున్నారు. శ్రీమంతులైతే డబ్బిచ్చి నీళ్ళు కొనుక్కోగలరు. కాని, బీదవారు మురికిగుంటలలోని నీళ్ళు త్రాగి రోగాలకు గురి అవుతున్నారు. కనుక, వాళ్ళకు పరిశుద్ధమైన నీరు అందించి వాళ్ళ ఆరోగ్యాలను కాపాడాలని, వాళ్ళు తరతరాలకు దీనిని అభివృద్ధి పరచుకొని ఆనందించాలనే ఉద్దేశ్యంతో మద్రాసు ప్రజలకు త్రాగునీరు అందించాలని నేను సంకల్పించుకున్నాను.

ఈవిషయమై మన సెంట్రల్ ట్రస్టు సెక్రెటరీ చక్రవర్తి, మద్రాసు నుండి శ్రీనివాసన్ *(అఖిల భారత శ్రీ సత్యసాయి సేవాసంస్థల అధ్యక్షులు)*, బొంబాయినుండి ఇందులాల్ షా *(శ్రీ సత్యసాయి వరల్డ్ కౌన్సిల్ ఛైర్మన్)* ముగ్గురూ కలసి ఢిల్లీకి వెళ్ళి వరల్డ్ బ్యాంకు అధికారులను కలిశారు. ప్రతిఫలాపేక్షరహితంగా మేము చేస్తున్న సేవాకార్యక్రమాలగురించి వారికి వివరించారు. వరల్డ్‌బ్యాంకువారు చాలా ఆశ్చర్యపడి 'ఇలాంటి సేవా కార్యక్రమాలను మేము ఏ దేశంలోనూ వినలేదు, కనలేదు', అన్నారు. సత్యసాయిబాబా ఎక్కడో ఉన్న మద్రాసుకు నీరు అందిస్తున్నారని తెలుసుకొని, దానికి అయ్యే ఖర్చంతా మేమిస్తామని ఒప్పుకొని, ఆవిషయాన్ని ఈరోజే మాకు ఫోనుద్వారా తెలియజేశారు. చూశారా! పవిత్రమైన భావాలకు పవిత్రమైన ఫలితాలే వస్తాయి. "డబ్బుకోసం మీరు యోచించకండి. మీరు మళ్ళీ మా దగ్గరికి రానక్కర్లేదు. ఈ ప్రాజెక్టుకు ఎన్ని కోట్లైనా మేము ఇస్తాము", అని చెప్పారు. వాళ్ళకు అంత విశాలమైన భావం కల్గడం ఎంత గొప్ప విషయం! ఈ ముగ్గురూ నిన్న రాత్రి ఏడు గంటలకు అక్కడినుండి తిరిగి వచ్చారు. వారు వచ్చి పన్నెండు గంటలైనా పూర్తి కాకుండానే ఈరోజు ఉదయం అక్కడినుండి ఫోను వచ్చింది. చూశారా! పవిత్రమైన హృదయంతో పనిచేస్తే తక్షణమే పవిత్రమైన ఫలితం వస్తుంది. దీనికి నేనే ప్రత్యక్ష నిదర్శనం. నేను చేసే ప్రతి పనిని నిస్వార్థంగా చేస్తాను. ఏది చేసినా పరోపకార నిమిత్తం చేస్తాను. ఈ సత్యాన్ని గుర్తించక కొందరు ఏదో ఫలితం కోసం చేస్తున్నానని అనుకుంటారు. దీనివల్ల

నాకు వచ్చే ఫలితమేమీ లేదు. నాకు వచ్చే ఫలితం ఒక్కటే. ఏమిటది? అందరూ ఆనందించినప్పుడు నేనుకూడా ఆనందిస్తాను. సాయిభక్తులైనందుకు మీరుకూడా సాయిమార్గాన్ని తు.చ. తప్పక అనుసరించి ఆనందాన్ని అనుభవించండి. నా అడుగుజాడలను అనుసరించినప్పుడు మీరు కూడా పవిత్రమైన ఫలితాలను పొందుతారు, సత్కీర్తిని సాధిస్తారు. పరదూషణ మానండి. మిమ్మల్ని ద్వేషించేవారికికూడా నమస్క రించండి. మీలో ఎంత ద్వేషం ఉంటుందో మీరు అంతగా క్రుంగిపోతారు. కనుక, ద్వేషానికి చోటివ్వకండి. ప్రేమను పెంచుకోండి. అందరినీ ప్రేమించండి. బీదలకు చేతనైనంత సహాయం చేయండి. పరులకు మీరు ఎంత సహాయం చేస్తే అంతకు పదిరెట్లు అధికంగా భగవంతుడు మీకు సహాయం చేస్తాడు. పరులకు ఎంత కీడు చేస్తే అంతకు పదింతలు అధికంగా మీకు కీడు జరుగుతుంది. ఈ సత్యాన్ని మరువకండి. ఈనాటినుండైనా మీరు ప్రేమమయులై, ప్రేమహృదయులై పవిత్రమైన పనులను ప్రారంభించండి.

*(2002 ఏప్రియల్ 13వ తేదీ ఉదయం సాయిరమేశ్ క్రిషన్ హాలు (బృందావనం)లో భగవాన్ బాబావారి దివ్యోపన్యాసం)*